

# బురుజువీధి కథలు

- కె.వి.రమణరావు



(వినగలిగితే భూగోళమ్మీద ప్రతి పదార్థమూ, ప్రతి ప్రదేశమూ కథలు చెబుతాయి. మరి, మా బురుజువీధీ అందుకు మినహాయింపు కాదు. మా బురుజువీధి చెప్పిన, చెబుతున్న కథలు నెలకొకటిగా మీ కోసం...)



# అమరావతి కథ

**ఉదయమే నేనూ** మా ఆవిడ కామేశ్వరి ముందుగదిలో కూర్చొని కాఫీ తాగుతున్నాము. మా బురుజువీధిలో చివర నదివొడ్డునున్న మార్కండేశ్వరాలయానికి వెళ్లేవాళ్లు, కూరగాయలమ్మేవాళ్లు అడపదడపా కనిపిస్తున్నారు. బసవలింగం గుడివైపు వెళ్తూ మా గేటుదగ్గర వేపచెట్టుకింద ఆగి నన్ను పిల్చాడు.

"గుడికెళ్తున్నావా? కాకపోతే కాఫీతాగి వెళ్తువుగాని రా" అన్నా. బసవలింగం మా వూర్లో ఒక బంగారం కొట్టుకు, మావీధిలో బురుజునుంచి మూడోయింటికి యజమాని.

"కాఫీ వొద్దుగానీ, యిదింకా నీదాకా రాలేదా సూర్యం? సోమరంగయ్య నిన్నటినుంచి కనిపించడంలేదంట. వాళ్లింటికే పోతున్నా" అన్నాడు గేటుదగ్గర నిలబడి

"వొళ్లు బాగలేదని మూడునెల్లనుంచి ఆయన బయటికి రావడంలేదుగా. వున్నట్టుండి యిదేంటి" అన్నా

"యేమోతెలీదు, సంఘంవాళ్లు అందర్నీ రమ్మన్నారు. నేపోతున్నా, నువ్వూరా" అని వెళ్లిపోయాడు.

"ఆయనకు వొళ్లుబాగై నెలన్నరైంది. డాక్టరు సలహామీద యాత్రలుకుడా చేసొచ్చి రెండువారాలైంది. మీకీ వీధిలోని విషయాలేమీ తెలీదు. వెళ్లిరండి, నేను తరువాతొస్తా" అంది మా ఆవిడ కామేశ్వరి లోపలికెళ్తూ.

సోమరంగయ్య పొలాలు, రైసుమిల్లు, ఇటుకవ్యాపారమున్న మోతుబరి. మావీధిలోని ధనవంతుల్లో అతనొకడు. అతనెక్కువగా పొలాల్లోవున్న వాళ్ల ఫార్మ్ హౌస్ లో ఉండేవాడు. ఈమధ్యన వయసు, అనారోగ్యం పెరగడంచేత కొడుకులకు బాధ్యత అప్పజెప్పి ఎక్కువగా ఇంట్లోనే ఉంటున్నాడు. వ్యాపారమున్నా రైతుకూడాకాబట్టి మనిషి భోళాగా కనిపిస్తాడు.

నేనూ చొక్కా మార్చుకుని సోమరంగయ్య ఇంటికెళ్లాను. అతనిది మావైపు అంటే కచేరిసత్రం వరసలో గుడినుంచి ఐదోయిల్లు. ఇంటిముందున్న బాదంచెట్టుకింద రెండుకార్లు, ఐదారు మోటరుసైకిళ్లు ఉన్నాయి. ఇంట్లో అప్పటికే మా వీధిలోని వాళ్లు, రంగయ్య చుట్టాలు ఇరవైమందిదాకా హాల్లో పోగయ్యారు. రంగయ్య భార్య నాగమణి సోఫాలో దిగాలుగా కూర్చుని అప్పుడప్పుడు ఏడుస్తోంది, ఓవైపు కూర్చుని ఆమె అమ్మ నర్సమ్మ ఓదారుస్తోంది. మరోవైపు మా సంఘ సభ్యురాలు సుగుణమ్మ ధైర్యం చెప్తోంది. ఆమె నాన్న జంగప్ప హాల్లో ఒక మూలగా కిటికీదగ్గర నిలబడి ఇదంతా చూస్తున్నాడు.

రంగయ్య కొడుకులిద్దరూ అటు ఇటూ తిరుగుతూ ఫోన్లు చేస్తున్నారు. కూతురుకూడా అత్తగారింటినుంచి వచ్చినట్టుంది. పరామర్శకొచ్చినవాళ్లకి కాఫీలు అవీ చూసుకుంటోంది. మావీధి 'పరోపకారి పాండురంగ', అతని భార్య

సుశీల ఆమెకు సహాయపడుతున్నారు. వాళ్ల ఎదురింటి 'వార్తల వనజమ్మ' ఓ చెవి ఇటువేసి కావలసినవాళ్లకు మంచినీళ్లిస్తోంది.

మావీధి సంక్షేమసంఘ పెద్దలు అప్పటికే ఈ వ్యవహారంగురించి నాగమణితోనూ, నర్సమ్మతోనూ మాట్లాడుతున్నారు. నాగమణి నన్నుచూసి వొకసారి కళ్లు తుడుచుకుంది.

నేను జంగప్ప దగ్గరికెళ్లి పలకరించి "యెలా జరిగింది" అని చిన్నగా అడిగాను.

"యాత్రలు చేసుకోని వచ్చి రెండువారాలైందా, మొన్నటివరకూ అంతా బాగానేవుంది. యాత్రలైనాక మళ్లా మామూలు మనిషైనాడు. అసలీరోజు పొద్దున్నే ముఖ్యమైనపనిమీద అందరం టౌనుకెళ్లేదుంది. మొన్నరాత్రి మామూలుగానే నిద్రపోయినాము. నిన్న తెలార్థామున రంగయ్య నాలుగ్గంటలకే లేచి సంచీతీసుకొని బయటికిపోయినాడు. 'అతనావిధంగా పొద్దున్నే పొలాలదగ్గరికి పోవడం మామూలేగదా' అని వీధితలుపు దగ్గిర పండుకున్న మా పనివాడు అనుకొన్నాడంట.

మధ్యాహ్నందాటినా రాకపోయేసరికి రంగయ్యకు ఫోన్ చేసినాము. యెవురుచేసినా స్విచ్ఛాఫైనట్టుగా వచ్చింది. ఫామౌసుకు చేస్తే అక్కడికి రాలేదన్నారు. యెవురింటికన్నా పోయినాడేమోనని తెలిసినోళ్లందరికీ ఫోన్లు చేసినాము. వాళ్లూ రాలేదని చెప్పినారు. అంతా అయోమయంగావుంది" నిర్వికారంగా వివరించాడు జంగప్ప.

"సంచిలో యేమైనా విలువైనవి తీసుకెళ్లాడా" అనడిగాను.

అతను నావైపు వింతగా చూసి "కొంచెం డబ్బు, అతని బట్టలు నాలుగు తప్ప యింకేమీ తీసుకుపోలేదు. అతని యేటీయెం కార్డు అతనిదగ్గరే వుంటుంది" అన్నాడు.

"యాత్రలో యేమైనా జరిగిందా" అన్నాను.

"అంతా బాగానే జరిగింది. అతను మాకంటే వుత్సాహంగా తిరిగినాడు" అని కొంచెం సంకోచించి "కొసాకు అమరావతిలో మాత్రం పూజలో కూర్చున్నాక కడుపులో తిప్పుతావుందని బయటికిపోయినాడు. మేం పూజైనాక పోయిచూస్తే వొకపక్కన నీడలో అరుగుమీద పండుకోనివున్నాడు. అక్కడ పనిచేసి వొకామె విసనకర్రతో విసుర్తావుంది. మేం గాబరాపడినాము. 'కండ్లుతిరిగి పడినాడని యిప్పుడు బాగనేవున్నా'డని ఆమె చెప్పింది. డాక్టరును పిల్చుకొచ్చి చూపిస్తే 'యేంలేదు, అలసటైందంతే' అన్నాడు. గుళ్లోనే రెస్టుతీసుకొని సాయంత్రానికి గుంటూరుకు చేరుకున్నాము. మళ్ల బాగానేవున్నాడు. ఆరాత్రికే బయల్దేరి పొద్దునకు మనవూరొచ్చేసినాము" అన్నాడు జంగప్ప.

జంగప్పతో అంతసేపు నేను మాట్లాడ్డం అన్నిసంవత్సరాల్లో అదే మొదటిసారి. అతని భార్యదేకూతురింట్లో పెత్తనమంతా. అతనెప్పుడూ ఏమీ పట్టనట్టుగా బయట అరుగుమీద కూర్చొని చుట్టతాగుతూ ఉండేవాడు.

వీధితలుపు తెరుచుకుని సోమరంగయ్య బావమరిది జయరాజు హాల్లోకి వచ్చాడు. అతను దూరప్రయాణంచేసొచ్చినట్టు అలసిపోయివున్నాడు. నేరుగా వాళ్లక్కదగ్గరికెళ్లి నిలబడి 'తను వెళ్లినచోట రంగయ్య

లేదన్న'ట్టుగా తల అడ్డంగా ఊపాడు. నాగమణి మరోసారి కళ్లు తుడుచుకుంది. సంఘపెద్దల్లో సీనియర్లు నిట్టూర్చారు. నాకేమీ బోధపడలేదు.

హాలుమధ్యలో మాటలుముగిసినట్టుగా అందర్నీ రమ్మని పిలిచారు.

మాసంఘ సెక్రెటరి మునిరెడ్డి అందరినీ ఉద్దేశించి మాట్లాడుతూ సోమరంగయ్య తప్పిపోయిన వైనం ఒకసారి వివరించి "అంతా మిస్టరీగావుంది. బస్టాండులో విచారిస్తే తెల్లవార్ఝామునే ఆయనేదో దూరప్రాంతంవెళ్లే బస్సులో ఎక్కినట్టు చూచాయగా తెలిసింది. మనం వేరేవూర్లలో మన ఫ్రెండ్స్ కి, బంధువులకి ఆయన ఫోటో ఫోన్లో పంపించి యెక్కడైనా కనిపిస్తే వెంటనే తెలియజేయమని చెప్పాలి" అన్నాడు. మిగతాసభ్యులు బలపరిచారు.

"ఫోన్లతో ఔతుందా? పోలీసు రిపోర్టివ్వచ్చుగదా" అన్నాడు మాయెదురింటి చలపతి.

"వొద్దు వొద్దు, వాళ్లు మేమేదో చేసినామని ముందు మామీద అనుమానపడ్తారు" అంది నాగమణి గాబరాగా

"పేపర్లో ఫోటో వేసి ప్రకటన యిస్తే బాగుంటుందిగదా, యిలాంటివి చూసే మా ఫ్రెండున్నాడు, చెప్తాను" అన్నాను నేను. మాసంఘ పెద్దలంతా నావైపు గుర్రుగా చూసారు.

"వొకసారి పరువుపోతే మళ్లా వస్తుందా బాబూ" కూతుర్ని వెనకేసుకొచ్చింది నర్సమ్మ.

"మనం యింట్లోవాళ్ల పరిస్థితి అలోచించాలగదా. కష్టం వీళ్లది, వీళ్లు చెప్పినట్టు చెయ్యడం మన బాధ్యత. మనసంఘం మనవాళ్లకెప్పుడూ బాధకలిగించని ధర్మమార్గంలోనే సమస్యలకు పరిష్కారం చూపిస్తుంది" అన్నాడు మా కోశాధికారి ధనరాజ్.

బంగార్రాజులేచి అందరి ఫోన్ నంబర్లు రాసుకోవడం మొదలెట్టాడు.

"ఐతే యిదంతా పబ్లిసిటి లేకుండా జరగాలి" అన్నాడు నారాయణమూర్తి.

"యింతమంది ఫోన్లలో వొద్దులే రాజూ, మనం కొంతమందిమి ప్రయత్నిద్దాంలే" అని బంగార్రాజును ఆపాడు బసవలింగం. ఫోనుద్వారా వెతికే బృందంలో నన్ను చేర్చుకోలేదు.

నేనూ చలపతి బయటకొచ్చాం. "యిరవైనాలుగ్గంటలు గడిచాక అసలీ రహస్యంగా వెతకడమేంది" అన్నాడు చలపతి. అదే నాకూ అర్థంకాలేదన్నాను. మేమింటికొచ్చేసాం.

ఆఫీసుకెళ్లేముందు భోంచేస్తూ "రంగయ్య వ్యవహారమంతా యేమిటో అయోమయంగావుంది" అన్నా మా ఆవిడతో.

"అసలు విషయం వేరు. పైక్కనపడేది వేరు" అంది కామేశ్వరి.

"లోపలేదో వున్నట్టు, అది నీకు తెలిసినట్టు మాట్లాడతావు. మనవీధి 'వార్తల వనజమ్మ' సమాచారం తప్ప చివరకేమీ వుండదందులో" అన్నా ఆవిడని కవ్విస్తూ

"ఐతే విను. కొడుకులు సరిగ్గా చదువుకుని పైకి రాకపోవడం, వాళ్ల నిర్వాకాలు, యింట్లో అత్తగారిపెత్తనం యెక్కువై రెండేళ్లగా చికాకుల్తో వున్నాడు. ఆరోగ్యమందుకే పాడైంది. రంగయ్యకు అప్పట్లో వ్యాపారంలో లాభాలొచ్చి టౌన్లో వొకయిల్లు, శివార్లలో పెద్దస్థలం కొన్నాడు. ఆమధ్యెవరో స్కూలువాళ్లు స్థలం దానంగా రాసివ్వమని అడిగితే 'సరే' అన్నాట్ట. వాళ్లీమధ్య యీయన చుట్టూ తిరుతున్నార్ట" అని నాకు టిఫిన్ బాక్స్ సర్దడానికి ఆగింది.

"యిదంతా నాకూ తెలుసు, ఐతే దానికీ రంగయ్య కనపడకుండా వెళ్లిపోవడానికి యేం సంబంధం?" అన్నా తినడం ముగిస్తూ

"అసలు విషయానికింకా రాందే" అని నవ్వి "రంగయ్య ఆస్థలం స్కూలుకు రాసిచ్చేస్తాడేమోనని భయపడి, యింటిల్లిపాది వొకటై, ఆయన అనారోగ్యాన్ని కారణంగాచూపి ఆస్తంతా భార్యాపిల్లల పేర్తో రాసి రిజిస్టరుచేయించాలని ఆర్నెల్లబట్టి సాధిస్తున్నారట. ఆరోగ్యం బాగయ్యాక యాత్రలనెపంతో వాయిదావేసాడు. అదీ ఐపోయింది. యివాళో రేపో బలవంతంగా వీలునామా రాయించి అతన్ని టౌనుకి తీసుకెళ్లి రిజిస్టరు చేయించడానికి అన్ని యేర్పాట్లూ చేసారట. నిన్నపొద్దున్నే అతను పారిపోయాడు. మావాళ్ల సత్యాన్వేషణ ఫలితాన్ని 'వార్తల వనజమ్మ' మాకంతా తెలిపింది. అదీ సంగతి" తేల్చింది కామేశ్వరి.

నేనాశ్చరపోయాను. 'వాళ్ల ప్రవర్తన గుంభనగా ఉండడానికి, పోలీసు రిపోర్టు ఇవ్వకపోవడానికి యిదే కారణమా? ఎంతటి మనుషులు? ఐనా యిల్లొదిలేసి యెన్నాళ్లని యెక్కడుండగలడు?' అనుకున్నాను.

"మొత్తానికి సీబిఐకూడా పసిగట్టలేని విషయాలు మీరు మీ అమ్మలక్కల నెట్ వర్క్ ద్వారా కనుక్కోగలుగుతున్నారు" అన్నా ఆఫీసుకు బయల్దేరుతూ.

"మాది 'స్త్రీ అభ్యుదయ' నెట్ వర్క్ అనండి. కానీ పాపం యింతబతుకూ బతికి రంగయ్యకిలా అయింది. యెక్కడ తలదాచుకున్నాడో యేమో" అంది విచారంగా.

నాలుగురోజుల తరువాత నాకు అర్జెంటుగా గుంటూరువెళ్లే ఆఫీసుపని పడింది. నే బయలుదేరేప్పటికి రంగయ్య ఇంట్లో పరిస్థితిలో మార్పు లేదు.

నాకు గుంటూర్లో రెండోరోజే పని పూర్తై మరుసటిరోజు ఖాళీ పడింది. 'అమరావతి చూసి చాలా యేళ్లైంది, చూసి వెళ్దా'మనిపించింది. బహుశా మొన్ననే జంగప్ప ఆగుడి గురించి చెప్పడంవల్ల, అది నదీతీరంలో ఉండడంవల్ల ఆ కోరిక కలిగిందేమో.

పొద్దున్నే బయలుదేరి వెళ్లాను. కృష్ణాతీరం చూసి గుడిలోకెళ్లి బయటికొచ్చేసరికి పదకొండయ్యింది. గుడిఆవరణలో ఒక పక్కకెళ్లి ఒకచోట కూర్చున్నాను. దూరంగా పిల్లలు ఒకసారి పెద్దగా నవ్వడం వినిపించింది. అటుకేసి చూస్తే ఒకతను చిరునవ్వుతో వీధిపిల్లలకు ప్రసాదం పంచుతున్నాడు. చూస్తే సోమరంగయ్యలాగున్నాడు. ఈమధ్యంతా

రంగయ్య వ్యవహారమే తలలోవుండి అలా భ్రమ పడ్డాననుకున్నాను. పరీక్షగా చూసాను. నా ఆశ్చర్యానికి అంతులేదు, అతను సోమరంగయ్యే!

వెంటనే అతనిదగ్గరికెళ్లాను. పక్కన నిలబడ్డ నన్ను అతను గమనించలేదు, వెళ్లిపోతున్న పిల్లలవంకే చూస్తున్నాడు. అతనిముందు ప్రసాదంకోసమన్నట్టుగా చెయ్యి చాపాను. తలతిప్పి నన్నుచూసిన సోమరంగయ్య నివ్వెరపోయాడు. కాసేపట్లో తేరుకున్నాడు.

"నువ్విక్కడ?" అన్నాను

"సూర్యం, నువ్వే వచ్చినావా, నేనిక్కడున్నట్టు తెల్సి నిన్ను పంపించినారా?" అడిగాడు రంగయ్య. జరిగిందంతా చెప్పాను.

అతను నవ్వి, "ఐతే నేనిక్కడవున్నట్టు చెప్పాల్సిన బాధ్యత నీకు లేదు. మూణ్రోజుల్లో నేనే మనవూరొస్తాను. యింటికి పద, అక్కడ మాట్లాడుకుందాం" అని దారితీసాడు.

గుడిబయటకొచ్చి రెండు సందులు తిప్పి సన్నటి వీధిలో ఒక చిన్నయింట్లోకి తీసుకెళ్లాడు.

అదొక రెండుగదుల ఇల్లు. ముందుగది, వెనక వంటిల్లు ఆతరువాత చిన్న పెరడు ఉన్నట్టు తెలుస్తోంది. గదిలో మంచం, పడక్కుర్చీ, రెండు మడతకుర్చీలు ఉన్నాయి. గోడలోకి చెక్కతలుపుల అల్మారా, టివీ తప్ప మరే వస్తువులూ లేవు. రంగయ్య ఒక మడతకుర్చీ వాల్చి నన్నుకూర్చోమని, మంచినీళ్లిచ్చి తను పడక్కుర్చీలో కూర్చున్నాడు. అతనిమొహంలో ఇదివరకులేని శాంతి ఏదో కనిపిస్తోంది.

అప్పుడే ఒకామె బయటినుంచి, నిండుగావున్న ఒకసంచీతో, తలుపుతోసుకొచ్చి నన్నుచూసి ఆగి "యెవరు" అంది అతనితో. ఆమె సన్నగా, చామనచాయలో, నుదుటిమీద పెద్ద బొట్టు. పచ్చటి నూలుచీర కట్టుకుని ఉంది. కళైన మొహం. వయసు యాభైయేళ్లపైన ఉంటుంది.

"మనవూర్నించి వచ్చినాడు. నేనిక్కడున్నట్టు తెలీదు. అనుకోకుండా కలిసినాడు. యితనిక్కూడా వంట చెయ్యి" అని ఆమెకు రంగయ్య నన్ను పరిచయం చేసాడు. ఆమె పేరు నీలమ్మ అని చెప్పాడంతే, ఆమెవరో చెప్పలేదు. ఆమె లోపలికెళ్లింది.

"రెండువారాలకింద యిక్కడికొచ్చి నీలమ్మదగ్గరే నేను కండ్లుతిరిగి పడిపోడం, నాకామే సేవలుజెయ్యయడం అంతా దైవగటన" అన్నాడు రంగయ్య ఆకాశంవైపు నమస్కారం చేసి.

ఇంతకూ ఈనీలమ్మెవరు, ఇతనిక్కడెందుకున్నాడు? ఈమెతో భార్యతోవున్నట్టే చనువుగా ఉన్నాడు, ఈమె ఇతని రహస్య రెండోభార్యా లేక ఈమెతో సహజీవనం చేస్తున్నాడా? ఈమెకంటే నాగమణే అందంగావుంటుందేమరి. పెద్దమనుషులుగా చలామణి అయ్యేవాళ్ల జీవితంలో ఇలా ఏదో ఒక రహస్యముంటుందా? నాకంతా అనుమానంగా ఉంది.

“రేపు లాయరు పేపర్లపని పూర్తిచేసుకోని ఫోన్ చేస్తాడు. యెల్లుండిదాకా నీపాటికి నువ్వుండు. ఆరోజుకు నేను మన జిల్లాకేంద్రానికొస్తాను. అక్కడ రిజిస్ట్రేషన్ పని ముగించుకొని ఆ మన్నాడు నేనే యింటికి వస్తాను" అన్నాడు రంగయ్య నాతో.

నీలమ్మ వంటింటి తలుపుదగ్గరికొచ్చి “నాకు యిల్లు, డబ్బు యేమీ వొద్దు. యిప్పుడు ప్రశాంతంగా వున్నా. యెప్పుడైనా చూడాలనిపించి ఆయన వస్తే చాలు. నువ్వన్నా చెప్పు బాబూ" అంది.

"నువ్వింగేమీ మాట్లాడొద్దు. మా బోజనంసంగతి చూడు" అని ఆమెను మందలించి నావైపు తిరిగి "సాయంత్రం క్రిష్న వొడ్డుకు పోదాం, అన్నీచెప్తా" అన్నాడు రంగయ్య.

నా అనుమానం మరింత పెరిగింది. ఎల్లుండి అక్కడ రిజిస్ట్రేషన్ అంటున్నాడు. కామేశ్వరి చెప్పింది కొంత నిజమే ఐనట్టుంది. ఐతే కామేశ్వరిబృందానికి నీలమ్మ సంగతి తెలిసినట్టులేదు.

"నేను సాయంత్రానికి గుంటూరు చేరాలి. రాత్రికే మనవూరికి బస్సు" అన్నా

"నిన్ను టైముకు పంపిస్తాగదా" అని నీలమ్మ సంగతి ప్రస్తావించకుండా మావూరు, మావీధి సంగతులు, తన బాల్యం గురించి మాట్లాడి, అప్పటిరోజుల్లోకి వెళ్లాడు రంగయ్య.

ఓగంటయ్యాక 'భోజనానికిరమ్మని నీలమ్మ పిలిచింది. భోజనంచేసి విశ్రాంతి తీసుకున్నాము. తరువాత ఇద్దరం కృష్ణవొడ్డుకు వెళ్లి రేవుదగ్గర చప్టామీద కూర్చున్నాం. నదిలోనీళ్లు పల్చగావున్నాయి. అంత ఎండగాలేదు.

"చెప్పు" అన్నా.

"నీలమ్మ నా మొదటి భార్య. చాలాయేండ్లతర్వాత మొన్ననే మళ్లా చూసినాను" అన్నాడు రంగయ్య తాపీగా.

నేనాశ్చర్యంతో నోరు తెరిచాను. అతను పట్టించుకోకుండా చెప్పుకుపోయాడు.

“అక్కడక్కడా వున్నకథే. నీలమ్మతో పెండ్లైనప్పుడు నావయసు యిరవైయేండ్లే. మానాయనకు గుండె బలహీనంగావుండేది. అందుకని నాపెండ్లి తొందరగా చేసినాడు. ఆయనకు యీమె దూరబ్బందువు. బతికిచెడిన మంచోళ్లు, తండ్రి లేడు. యీమె చిన్నప్పట్నించి శానా నెమ్మదైనమనిషి. మా అమ్మకు యీసంబంధం అస్సలిష్టంలేదు. ఆమె అక్క మనమరాల్ని, అంటే నాగమణిను కోడలిగా తెచ్చుకోలేదని యీమెతో పంతంగావుండేది" అని ఆగాడు.

“మీ నాన్న సర్దిచెప్పలేదా?” అన్నా.

“వొక సంవత్సరం కాపురం చేసినాము. మానాన్న చనిపోయినాడు. మా అమ్మ పిల్లలకోసమని నీలమ్మను డాక్టరుకు చూపించింది. డాక్టరు ఆమెలో కొంచెం లోపముందని చెప్పింది.

"నీలమ్మను సిటీలో పెద్దడాక్టరుకు చూపించాల్సింది" అన్నా

"అప్పట్లో బొంబాయిలోగాని ఆ సౌకర్యాలులేవన్నారు. మాఅమ్మకు నీలమ్మను వదిలించుకోవడానికి సందు దొరికింది. నీలమ్మను హీనంగాచూస్తా నాకు రెండోపెళ్లి ప్రయత్నాలు మొదులుపెట్టింది. నీలమ్మతల్లి మనవీధి పెద్దమనుషుల దగ్గిర పంచాయతి పెట్టిచ్చింది. అప్పుడున్న పెద్దమనుషులు మా అమ్మనోటికి, చేతలకు బైపడి సరైన దర్మం చెప్పకుండా 'సంతానం కలగనప్పుడు రెండోపెళ్లి మన శాస్త్రాల్లో సమ్మతమే'నని చెప్పినారు. 'యిదే మీకూతురైతే యిట్లే చెప్తా'రాని ఆతల్లి యేడ్చినా యెవురూ పలకలేదు. ఆమన్నాడు పొలంలోవున్న నాదగ్గరికి కూతుర్ని వెంటబెట్టుకొనివచ్చి 'నాకూతురిక్కడుంటే బతకదు, తీసుకెళ్లిపోతున్నా'నని చెప్పి వెళ్లిపోయింది.

నా కుర్రతనం, నాగమణి చక్కదనం, మా అమ్మంటే భయం, శాస్త్రంలోవుందని, వంశోద్ధారకులకోసమని నేనూ అప్పుడేమీ మాట్లాడలేదు. నాకు నాగమణితో మనువైపోయింది. ఆనకెప్పుడో నాతప్పు నాకు తెలిసొచ్చిందనుకో"

"అయ్యో. మరి నీలమ్మ?" అన్నాను. రంగయ్య విచారంగా నవ్వాడు.

"యేడాదికి రెండుసార్లు పంటొచ్చినప్పుడంతా నేనే వాళ్లవూరెళ్లి డబ్బిచ్చేవాడిని. ఆనక మాఅమ్మ తెలివిగా నన్ను పంపకుండా నా బావమరిది జైరాజుతో పంపిచ్చేది. నీలమ్మకు వొక్కటే చెల్లెలు, అమాయకురాలు. ఆమెను వాళ్ల బంధువు నరేంద్రకిచ్చి చేసినారు. అప్పట్నించి వాడొచ్చి డబ్బు తీసుకెళ్లేవాడు. నీలమ్మతల్లి పోయేవరకు బాగానే వున్నారు. ఆనక నరేంద్ర చేతిలోపడి సంసారం పాడైంది. నేనిచ్చిన డబ్బును స్వంతానికి వాడుకొని నీలమ్మకు సరిగ్గా తిండికూడా పెట్టేవాడుకాదు. నేను డబ్బివ్వలేదని, విసుక్కుంటున్నానని చెప్పేవాడు. ఆమె మౌనంగా భరించేది. వొకసారి అందరూ దగ్గిర్లో పుష్కరాలకుపోతే అక్కడ వొక మఠంవాళ్లు నీలమ్మపరిస్థితిచూసి జాలిపడి నరేంద్రకు చెప్పకుండా ఆమెను వాళ్లతో వుత్తరదేశం తీసుకుపోయినారు. ఆ తరువాత ఆమెనిదే నేను చూడ్డం"

"మరి ఆమె వెళ్లిపోయినప్పుడు మీకు తెలియలేదా?" అడిగాను

"నరేంద్ర నాకు చెప్పడానికి భయపడినాడు. ఐనా డబ్బుమాత్రం టంచనుగా తీసుకపోయేవాడు. వొకసారి నేను వెళ్తే విషయంతెలిసి గెట్టిగా నిలదీసినాను. ఆపైన మొహంచెల్లక వాడు పెళ్లాంతో కన్నడదేశానికి వెళ్లిపోయినాడు. నేను యీమెకోసం చాలారోజులు వెతికించినాను, ఆచూకి దొరకలేదు. ఆరేండ్లకింద మఠంలో పెద్దస్వామీజి పోయినాక యీమె యీవూరొచ్చి యీగుళ్లో పనిచేసుకుంటా కాలం గడుపుతున్నది. మొన్న మేమొచ్చినప్పుడు నన్ను చూసింది. ముందు ఆమేగుర్తుపట్టినా నేను కనుక్కునేదాకా తెలియనట్టే సేవలు చేసింది. జైరాజుతప్ప నాగమణివాళ్లెవరూ యీమెను అప్పట్లో సరిగ్గా చూసివుండలేదు. జైరాజు యాత్రలకు రాలేదు"

"మీ భార్య అయ్యుండీ యెన్ని అవస్థలు పడింది, పాపం" అన్నాను.

"వంశోద్ధారకులు పుడితే సరిపోతుందా, వాళ్లు ప్రయోజకులు కావాల. యిప్పుడు యింట్లో మాఅత్తదే పెత్తనం. నాకు వొళ్లు బాగలేకపోయేసరికి ఆస్తంతా పిల్లల పేర్తోరాసి రిజిస్టరు చెయ్యించమని ఆర్నెల్లనించి ప్రాణాలు

తోడేస్తావున్నారు. యెప్పటికైనా నీలమ్మ వొచ్చి సగభాగం అడుగుతుందేమోనని వాళ్లభయం. మంచివాళ్లను అర్ధం చేసుకోవాలంటే మనలోగూడా కొంచెం మంచితనం వుండాలనుకుంటా"

"నువ్విలా రహస్యంగా రావడమెందుకు? మన వీధి పెద్ద మనుషులతో చెప్పించివుండచ్చుగదా?" అడిగాను.

రంగయ్య నావైపు చూసి "అదీ అయ్యింది. కబురుచేస్తే వొకరాత్రి నలుగురొచ్చినారు. నేను నీలమ్మ కనపడినసంగతి చెప్పలేదు. ఆమె యెక్కడో వుండేవుంటుందని మాత్రం చెప్పినాను. చదువు మనుషులను యెక్కువతక్కువలుగా చూసేదిగా వుండగూడదు. చదువుకున్నారుగాని మనవీధి పెద్దమనుషుల ఆలోచనలు మారలేదు. వాళ్లు నాగమణికి, ఆమె తల్లికి భయపడి వాళ్లకే వంత పాడినారు. వుందో లేదో తెలియని మనిషికి వాటా యివ్వక్కర్లేదన్నారు. యింక లాభంలేదని యెవరికీ చెప్పకుండా యిక్కడికొచ్చేసినాను. మనటౌన్లో స్కూలు మంచిదంట. యెల్లుండి అక్కడి స్థలం స్కూలుకు, యిల్లు నీలమ్మకు రిజిస్టరుజేసి, ఆమెపేర్తో బ్యాంకులో డబ్బు డిపాజిటుచేసి ఆపైన వూరికొస్తాను. ఆమె వద్దంటావుందిగాని వినేదిలేదు" అన్నాడు.

యిద్దరంలేచి ఊర్లోకొచ్చాము. అతను ఇంటికెళ్లాడు. నేను బస్టాండువైపు నడిచాను.

నీలమ్మకు న్యాయం జరగబోతున్నందుకు నామనసు తేలికైంది. రంగయ్య అదృశ్యంలోని అసలువిషయం కామేశ్వరికంటే నాకు ముందుగా తెలిసినందుకు గర్వంగా అనిపించింది. ఐతే రంగయ్యకు మాటయిచ్చినందువల్ల వెళ్లగానే కామేశ్వరికి విషయం చెప్పాలావద్దా అన్న ధర్మమీమాంస నన్నావరించింది. పొద్దున బస్సుదిగి మా బురుజువీధిలోకి తిరిగి ఇల్లుచేరేవరకుకూడా నా మీమాంసకు పరిష్కారం తోచలేదు.

(మా బురుజ వీధి చెప్పిన మరోకథ వచ్చేనెలలో)

Post your comments